సాక్షి సూర్యాపేట

శుక్రవారం, 3, మే, 2024



తొలి రోజు ముగ్గురు

వరంగల్- ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గురువారం తొలిరోజు ముగ్గురు నామినేషన్లు వేశారు.

- IIలో



ఓట్ల వేటకు ఎండ దెబ్బ!

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీలు చేస్తున్న ఓట్ల వేటపై భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు.

- IIలో

గరిష్ఠం / కనిష్ఠం

44° / 30°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

పదునెక్కిన ప్రచారం!

ఉమ్మడి జిల్లాకు క్యూ కడుతున్న అగ్రనేతలు

- సామాజిక సమీకరణలపైనా పార్టీల దృష్టి
- ఇప్పటికే ఆ దిశగా చర్యలు చేపట్టిన బీజేపీ
- సమావేశాలకు ప్లాన్ చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రచారం ఊపందుకుంది. అన్ని రాజకీయ పార్టీలు ప్రచారాన్ని వేగవంతం చేయడంతో పాటు విమర్శలు, ప్రతి విమర్శలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ ప్రచారాలకు మరింత పదును పెట్టాయి. ఆయా పార్టీల అధినేతలు కూడా ప్రచారానికి వస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లోక్‌సభ ఎన్నిల ప్రచారంలో భాగంగా చేపట్టిన బస్సుయాత్రను ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే ప్రారంభించారు. ఇటీవలే రెండు రోజులు రోడ్‌షో నిర్వహించారు. మాజీ మంత్రి హరీష్‌రావు శుక్రవారం నల్లగొండ పట్టణం, చండూరులో జరిగే రోడ్‌షోలలో పాల్గొంటారు. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర స్థాయి నాయకులు జిల్లాలో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటుండగా, జాతీయ స్థాయి అగ్రనేతలు రంగంలోకి దిగుతున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఈ నెల 6న నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్నారు.

అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు

కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో సమావేశాలను నిర్వహించింది. వివిధ సామాజికవర్గాల వారితో సమావేశాలకు సిద్ధమవుతోంది. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆయా నియోజకవర్గాల్లో భారీ ఎత్తున సమావేశాలు నిర్వహిస్తున్నారు. సాగర్, దేవరకొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, నల్లగొండ నియోజకవర్గాల్లో యువత, అడ్వకేట్స్, వివిధ సామాజికవర్గాల వారితో సమావేశాల నిర్వహణకు నిర్ణయించింది. మాజీ మంత్రి జానారెడ్డి తనయుడు ఎంపీ అభ్యర్థి కందూరు రఘువీర్‌రెడ్డి గెలుపు బాధ్యతను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉత్తమ్‌కు అప్పగించారు. జానారెడ్డి కూడా ప్రతి నియోజకవర్గం తిరుగుతూ సామాజికవర్గాల వారీగా జనాలను కలుస్తున్నారు.

సభలు, సమావేశాల్లో బీజేపీ

బీజేపీ అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డి తరఫున ప్రచారం చేసేందుకు అగ్రనేతలు రంగంలోకి దిగుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా 6వ తేదీ రాబోతున్నారు. ఇప్పటికే బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి సుడిగాలి పర్యటన చేస్తూ రోడ్‌షోలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. మొత్తానికి నల్లగొండ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ స్థానం నిలబెట్టుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతుండగా, బీఆర్ఎస్ ఈసారైనా విజయం సాధించాలన్న ఉద్దేశంతో అధికార పార్టీపై అస్త్రాలు సంధిస్తోంది. బీజేపీ మాత్రం రాష్ట్రంలో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం వైఫల్యాలు, నరేంద్రమోడీ చరిష్మాను నమ్ముకొని నల్లగొండలో పాగా వేయాలని ముందుకు సాగుతోంది.

గెలుపు బాధ్యత జగదీష్‌రెడ్డిపై!

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు బాధ్యతను మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి తీసుకున్నారు. ఇప్పటికే నల్లగొండ, సూర్యాపేటతో పాటు మిగిలిన నియోజకవర్గాల్లో నియోజకవర్గ సమావేశాలు, రోడ్ షోలు నిర్వహించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎండిన పంటల పరిశీలన, బస్సు యాత్ర మిర్యాలగూడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో నిర్వహించారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఊపు వచ్చింది. కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరువు వచ్చిందని, కరెంటు పోతోందని, 5 ఎకరాల వారికి రైతు బంధు ఇవ్వడం లేదంటూ, రూ. 2 లక్షల రుణమాఫీ డిసెంబరు 9న ఎందుకు ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ విమర్శిస్తోంది. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని, కరువు కాంగ్రెస్‌తో వచ్చిందంటూ నేతలు విమర్శిస్తూ ఓటర్లను ఆకట్టుకునే విధంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్ కూడా సామాజికవర్గాల వారీగా ఓటర్లను కలుస్తూ సమావేశాల నిర్వహణకు కసరత్తు చేస్తోంది.

కాంగ్రెస్ పథకాలతోనే దేశాభివృద్ధి



మునగాలలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేదికపై అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, చందర్‌రావు తదితరులు

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్

మోతె, మునగాల : కాంగ్రెస్ సంక్షేమ పథకాలతోనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మోతె, మునగాలలో నిర్వహించిన లోక్‌సభ ఎన్నిల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. పదేళ్ల నుంచి దేశాన్ని పట్టిపీడిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. దేశంలో మతవిద్వేశాలను రెచ్చగొట్టి తిరిగి మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు మోదీ పథకం పన్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి పాలన చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిన కాంగ్రెస్ కార్యకర్తలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు కమ్యూనిస్టులు మద్దతు పలకడం శుభపరిణామన్నారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి ఐదు లక్షల మెజార్టీ ఖాయమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకువచ్చేందుకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని సీపీఎం బలపరుస్తోందన్నారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నల్లగొండను మరింత అభివృద్ధి చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురుతుందన్నారు. ఆయా సభల్లో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె.శంకర్‌నాయక్, చెవిటి వెంకన్న యాదవ్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి,మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మోతె మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, జెడ్పీటీసీ పుల్లారావు, ఎంపీపీ ముప్పాని ఆశాశ్రీకాంతరెడ్డి, మండల నాయకులు మైనంపాటి గుర్వారెడ్డి, సామ చిన వెంకటరెడ్డి, మాతృనాయక్, మధుసూదన్‌రెడ్డి, కోట సుధాకర్‌రెడ్డి, ఎలుగు వీరన్న. మునగా ఎంపీపీ ఎలక బిందు, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లపాటి ప్రమీల, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి , జిల్లా కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి మాతంగి బసవయ్య, మండల పార్టీ నేతలు నల్లపాటి శ్రీనివాస్, ఎలక నరేందర్‌రెడ్డి, వేనేపల్లి వీరబాబు, భీంపంగు శంకర్, సీపీఎం,సీపీఐ నేతలు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ , సీఎం రేవంత్ కుట్ర

- కేసీఆర్ ప్రచార నిషేధంపై మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ప్రచార నిషేధం విధించడం మోడీ, రేవంత్ కుట్రలో భాగమే అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. గురువారం సూర్యాపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ, రేవంత్ విద్వేష ప్రసంగాలు, ఫేక్ వీడియోలు ఎన్నికల కమిషన్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు చేనేత కార్మికులను అవమానించినట్లుగా మాట్లాడిన సందర్భంలో స్పందించిన కేసీఆర్ మాటలను వక్రీకరించారని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ బస్సు యాత్రతో రేవంత్, మోదీకి వణుకుడు మొదలైందని అన్నారు. ఆరు యాత్రలతోనే ఇద్దరి కాళ్ల కింద భూమి కంపిస్తోందని పేర్కొన్నారు. ఛోటే భాయ్..బడే భాయ్ ఇద్దరు కుట్ర చేసి కేసీఆర్ ప్రచారం ఆపాలని చూశారని మండిపడ్డారు. కేసీఆర్ వెంట ప్రజా ప్రభంజనం చూసి భయపడుతూ చిల్లర ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ ని అడ్డుకోవడంతో ప్రచారానికి మించి రెట్టింపు ప్రజా మద్దతు వస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ విద్వేషాల ప్రచారం ఎన్నికల కమిషన్‌కు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. ఫేక్ వీడియోలు ప్రచారం చేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌కు నోటీసులు ఇచ్చారని కానీ బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ క్రిషాంక్‌ను అరెస్టు చేయడం , బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రచార నిషేధం విధించడం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్‌ను అడ్డుకోకపోతే నష్టం జరుగుతుందనే కుట్రకు తెర లేపారని ఆయన ధ్వజమెత్తారు. వీధి రౌడీగా మాట్లాడిన సీఎం రేవంత్ స్వేచ్ఛగా తిరుగుతుంటే కేసీఆర్‌ను మాత్రం ఇంటికి పరిమితం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ ఢిల్లీ మూటలపై సమాచారం ఉంటే మోదీ ఎందుకు కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. రేవంత్ అవినీతి తెలిసినా మోదీ విచారణ సంస్థలు ఏం చేస్తున్నాయని అన్నారు. కేసీఆర్ లేవనెత్తుతున్న ప్రజా సమస్యలను చర్చకు రానీయకుండా పక్కదారి పట్టించడానికే వారు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. నిషేధాలు ఏవీ కేసీఆర్‌ను ఆపలేవు అని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రచారంలో ఎందుకు కనిపించడంలేదని ప్రజల్లో అప్పుడే చర్చ మొదలైందన్నారు. ఎన్ని నిషేధాలు పెట్టినా రాష్ట్రంలో 16 లోక్‌సభ స్థానాలు తమవే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు మద్దతుగ నేతన్నలు కదిలివస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్‌ను ప్రచారం చేయకుండా ఆపడం తమకు ఓట్ల శాతాన్ని పెంచుతుందని ఆయన అన్నారు. ఓటుకు నోటు కేసు ఇక్కడ ఉంటే ప్రభావితం చేస్తారని అనుమానం ఉందని అన్నారు. అందుకే ఇతర రాష్ట్రంలోకి మార్చాలని కోరాం అని అన్నారు. కోర్టు నుంచి సరైన నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, గండూరి ప్రకాశ్, ఆకుల లవకుశ పాల్గొన్నారు.

రూట్ మొబైల్ సిబ్బంది విధులు ప్రధానం

సూర్యాపేట: ఎన్నికల నిర్వహణలో రూట్ మొబైల్ సిబ్బంది నిర్వహించే విధులు ప్రధానమైనవని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధి రూట్ మొబైల్ డ్యూటీ పోలీస్ సిబ్బందితో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, ట్రైనీ ఐపీఎస్ రాజేష్‌మీనాతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎన్నికల రూట్లలో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు ఆ మార్గంలో వచ్చే గ్రామాలు, పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులపై నిశిత పరిశీలన ఉండాలని తెలిపారు. సెక్టార్ అధికారులు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులు తమ వివరాలు, అధికారిక ఫోన్ నంబర్‌ను కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు రవి, మట్టయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, శ్రీను, రఘువీర్ రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

మతోన్మాద బీజేపీని ఓడించాలి



మునగాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

మునగాల(కోదాడ): లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మునగాల మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ఇప్పటికే రెండు సార్లు ప్రధానిగా ఉండి దేశాన్ని అథోగతి పాలు చేశారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టుపట్టించి ,రాజ్యాంగేతర శక్తిగా ప్రధాని ఎదిగాడన్నారు. మతవిద్వేషాలు రెచ్చగొట్టి పాలన కొనసాగిస్తున్నారన్నారు. మూడోసారి అధికారంలోకి రావడానికి మోదీ కుట్రలు పన్నుతున్నాడని ఆరోపించారు. బీజేపీ మూడో సారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదముందన్నారు. ఇండియా కూటమిలోని పార్టీల విధానాల పట్ల రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ మోదీని ఓడించేందుకు కలవక తప్పడం లేదన్నారు. ఇండియా కూటమిలో ఒప్పందంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 16నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి తమ పార్టీ మద్దతు ఇచ్చేందుకు నిర్ణయించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించేందుకు సీపీఎం కృషిచేస్తోందన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దేవరం వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు డి.స్టాలిన్‌రెడ్డి, బచ్చలకూరి స్వరాజ్యం, జూలకంటి విజయలక్ష్మి, వీరబోయిన వెంకన్న, జూలకంటి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులకు అందుబాటులో ఉండాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్ రెడ్డి



జిల్లా జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

చివ్వెంల(సూర్యాపేట) : న్యాయవాదులు కక్షిదారులకు అందుబాటులో ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. గోవర్ధన్ రెడ్డి సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ప్రధాన జడ్జి గోవర్ధన్‌రెడ్డి, మొదటి అదనపు జడ్జి శ్యామ్‌శ్రీలను గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి పి.సురేష్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బీయూలాలకు ఫస్ట్ లెవల్ చెకింగ్



ఈవీఎం గోదాంలో బ్యాలెట్ యూనిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటరావు

సూర్యాపేట : జిల్లాకు చేరుకున్న అదనపు బ్యాలెట్ యూనిట్‌లకు ఫస్ట్ లెవల్ చెకింగ్ చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకటరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంలో చేపట్టిన ఎఫ్ఎల్‌సీను జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, బీఎస్ లతతో కలిసి పరిశీలించి మాట్లాడారు. నల్లగొండ, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎక్కువగా ఉన్నందున ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాకు 1,200 అదనపు బ్యాలెట్ యూనిట్లును తెప్పించి 12 మంది ఈసీఐఎల్ ఇంజనీర్లతో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి రోజు ఎఫ్ఎల్‌సీ చేపట్టామన్నారు. తర్వాత ర్యాండమైజేషన్, సెగ్రిగేషన్ అనంతరం నియోజకవర్గాలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాస్, బీఆర్ఎస్ నుంచి సవరాల సత్యనారాయణ, బీజేపీ నుంచి అబిద్, బీఎస్పీ నుంచి స్టాలిన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస రాజు, ఏఓ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ తప్పిన వారిపై ప్రత్యేక దృష్టి

- ఫెయిలైన 5,116 మంది విద్యార్థులకు స్పెషల్ క్లాసులు
- అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో పాస్ అయ్యేలా తర్ఫీదు
- పాస్ అయిన వారికి ఎంసెట్, నీట్ శిక్షణ
- ప్రత్యేక కార్యాచరణ రూపొందించిన ఇంటర్ బోర్డు



హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

హుజూర్‌నగర్ : ఇంటర్ పరీక్ష ఫలితాలు ఈ సారి కొంత నిరాశపరిచాయి. రాష్ట్ర స్థాయి ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కింది వరుసలో ఉంది. గత ఫలితాలతో పోల్చితే కొంత మెరుగ్గానే ఉన్నప్పటికీ మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. వీరికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అనుత్తీర్ణులైన వారిని అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేయనున్నారు. ఇక ఉత్తీర్ణులైన పిల్లలకు ఎంసెట్, నీట్‌లో శిక్షణ ఇప్పించాలని భావించారు. అందుకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేశారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వారు పాస్ అయ్యేలా తర్ఫీదు ఇవ్వనున్నారు.

జిల్లాలో ఫెయిల్ అయిన వారు 5,116 మంది...

జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 6,637 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 6063 మంది ఇలా మొత్తం 12,700 మంది విద్యార్థులు ఈ సారి పరీక్షలు రాశారు. వీరిలో ప్రథమ సంవత్సరంలో 3,357 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,259 మంది ఇలా మొత్తం 5,116 మంది ఫెయిల్ అయ్యారు. దీంతో వారు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో పాస్ అయ్యేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

రోజూ మూడు గంటలపాటు..

ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం పూట మూడు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధమైంది. త్వరలోనే ఈ కార్యాచరణ ప్రక్రియను అమలు చేయనున్నారు. ఆయా సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన వారికి సబ్జెక్టు నిపుణులతో తర్ఫీదు ఇవ్వనున్నారు. ప్రస్తుత వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండటంతో ఉదయం పూటనే ప్రత్యేక తరగతులు జరపాలని అధికారులు నిర్ణయించారు. వీరిని అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేయనున్నారు.

మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక చర్యలు



ఇంటర్ పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని నిర్ణయించాం. ఈ ఏడాది అనకున్నంతగా ఫలితాలు రాలేదు. ఆసకి ఉన్న వారికి ప్రత్యేక తరగతులు తీసుకుని అడ్వాన్స్‌డ్ పరీక్షలకు సన్నద్ధం చేయడం జరుగుతుంది. అంతే కాకుండా ఎంసెట్, నీట్ పరీక్షలు రాసే అభిలాష ఉన్న వారికి ప్రత్యేక శిక్షణ ఇప్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని అధ్యాపకులు సమిష్టి కషితో నిర్ణయం తీసుకోవడం జరిగింది.

– కృష్ణయ్య, డీఐఈఓ, సూర్యాపేట.

ఎంసెట్, నీట్ పై ఆసక్తి ఉన్న వారికి..

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో ఎంసెట్, నీట్‌లో ఆసక్తి ఉన్న వారికి ఇంటర్‌బోర్డు అధికారులు ప్రత్యేక శిక్షణ ఇప్పించనున్నారు. వారు కఠిన అంశాలపై సమగ్ర పట్టు సాధించేలా చర్యలు చేపడతారు. రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం తదితర అన్ని అంశాలపై విశదీకరించి బోధించనున్నారు. వారికి ఎలాంటి సందేహాలు ఉన్నా అప్పటికప్పుడు నివృత్తి చేసి అన్నిరకాలుగా పరీక్షలకు సంసిద్ధులను చేయనున్నారు.

న్యూస్‌రీల్

60 శాతానికి పైగా ధాన్యం కొనుగోళ్లు



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఏఓ

అర్వపల్లి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు 60శాతానికి పైగానే పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం, అడివెంల సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. ధాన్యం రాశుల్లో తేమ శాతాన్ని చూసి 17 శాతం వరకు తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు పొలాల వద్దే ధాన్యాన్ని ఆరబెట్టి శుభ్రం చేసి రాళ్లు, చెత్త లేకుండా తెస్తే వెంటనే కాంటాలు వేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నేరేళ్ల సత్యం, నిర్వాహకులు దేవరకొండ విజయ, స్వప్న, ధనమ్మ, భవాని, రైతులు పాల్గొన్నారు.

పశువైద్యశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి

కోదాడరూరల్: గ్రామాల్లో పశువైద్య అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి అన్నారు. గురువారం కోదాడ మండల పరిధిలోని ఎర్రవరం పశువైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. వేసవిలో పశుపోషణ, యాజమాన్యంపై పాడి రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో నీటితొట్లలో నీరు ఉండే విధంగా చూడాలన్నారు. పచ్చిమేత కొరతను అధిగవించేందుకు పశుగ్రాసాలను సాగు చేసుకొని పాలదిగుబడి తగ్గకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగేంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.

తనిఖీలు వేగవంతం చేయాలి

భానుపురి (సూర్యాపేట) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని చెక్‌పోస్టుల్లో తనిఖీలు మరింత వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ లావాదేవీలు, బ్యాంక్ లావాదేవీలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు జరిగే వాటిపై బ్యాంకర్లు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. పోస్టల్ శాఖ ద్వారా జరిగే లావాదేవీలపై నిఘా ఉంచాలని తెలిపారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లు, ఎక్సైజ్ శాఖ టీములు తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాలో నల్లబెల్లం, బెల్టుషాపుల నిర్వహణ కట్టడి చేయాలని పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్ శాఖ సమన్వయంతో కలసి పని చేయాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.2.73కోట్ల నగదు, రూ.1.41కోట్ల విలువైన మద్యం, రూ.23.92 లక్షల విలువైన 42 వాహనాలు, రూ.1.21కోట్ల విలువైన బంగారం, ఇతర ఆభరణాలు, రూ.93.51 లక్షల విలువైన ఇతర వస్తువులు.. వీటి మొత్తం విలువ రూ.6.53కోట్లు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

సౌకర్యాలు కల్పించాలి

మద్దిరాల: ఉపాధి హామీ పని జరిగే ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని స్టేట్ విజిలెన్స్ ఆఫీసర్ ఉషా, అడిషనల్ పీడీ శిరీష తెలిపారు. గురువారం మద్దిరాల మండల పరిధిలోని గోరెంట్ల గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేయాలని, తాగు నీరు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట ఎంపీడీఓ సత్యనారాయణ, ఏపీఓ గుండు వెంకన్న, టీఏలు మురళి, ఈసీ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి మంగ తదితరులున్నారు.

'నాకు గన్‌మెన్‌లు అవసరం లేదు'

నల్లగొండ క్రైం: తన వ్యక్తిగత రక్షణ కోసం కేటాయించిన ఇద్దరు గన్‌మెన్‌లను తిరిగి పంపిస్తున్నానని, అందుకు అనుమతించాలని బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గురువారం సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డేకు లేఖ రాశారు. 'నాకు గన్‌మెన్‌లు అవసరం లేదు. ప్రజలే రక్షణగా ఉన్నారు' అని ఆయన లేఖలో పేర్కొన్నారు.

తొలిరోజు ముగ్గురు 'పట్టభద్రులు'

వరంగల్– ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు గురువారం తొలిరోజు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు, ప్రజావాణి పార్టీ తరఫున పాటి శ్రీకాంత్‌రెడ్డి, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య నామినేషన్లు వేశారు. ముగ్గురు అభ్యర్థులు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించినట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన తెలిపారు.

–నల్లగొండ:


తెలంగాణ సకల జనుల పార్టీ అభ్యర్థిగా నామినేషన్ సమర్పిస్తున్న నందిపాటి జానయ్య


ప్రజావాణి పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న పాటి శ్రీకాంత్‌రెడ్డి


స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న బండారు నాగరాజు

ఎన్నికల సిబ్బందికి వసతులు కల్పించాలి

నకిరేకల్: లోక్‌సభ ఎన్నికల శిక్షణ, పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి సరైన వసతులు కల్పించాలని, రెమ్యూనరేషన్‌లో తేడాలు సవరించాలని కోరుతూ నకిరేకల్‌లోని గురుకుల పాఠశాలలో ఎన్నికల శిక్షణకు హాజరైన పీఓలు, ఏపీఓలు, ఇతర సిబ్బంది గురువారం నిరసన తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు పూటలా శిక్షణ నిర్వహిస్తున్నప్పటికీ లంచ్, స్నాక్స్ కూడా ఏర్పాటు చేయడం లేదన్నారు. రెమ్యూనరేషన్ విషయంలో ఇతర జిల్లాల సిబ్బందితో పోల్చితే తేడాలు ఉన్నాయని, వాటిని సవరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో చందులాల్, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, ఫాతీమామేరీ తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎన్నికల సిబ్బంది

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

నల్లగొండ: జిల్లా కేంద్రం సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఎఫ్‌సీఐ గోదాంలలో ఏర్పాటు చేయనున్న లోకసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని గురువారం జిల్లా ఎన్నికల పరిశీలకులు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ, కళ్యాణ్ కుమార్ దాస్, అమోగ్ జీవన్ గాంకర్ తనిఖీ చేశారు. బారికేడింగ్, స్ట్రాంగ్‌రూం, ఓట్ల లెక్కింపు హాళ్లలో సౌకర్యాలు, ఓట్ల లెక్కింపునకు వినియోగించనున్న టేబుళ్లు, సీసీ కెమెరాలు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. వారి వెంట నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనా దీప్తి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ చంద్రమోహన్, పీఆర్ ఈఈ భూమయ్య, డీఈ నాగయ్య, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్ ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్, ఎస్పీ

ఈవీఎంల తనిఖీ

కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంలో ఉన్న ఈవీఎంలను జిల్లా ఎన్నికల పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ గురువారం పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన, పార్లమెంట్ నియోజకవర్గ డిప్యూటీ రిటర్నింగ్ అధికారి నటరాజ్, ఈవీఎంల ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ఓట్ల వేటకు ఎండ దెబ్బ!

- లోక్‌సభ ఎన్నికల ప్రచారంపై భానుడి ప్రతాపం
- ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించేందుకు కార్యకర్తల ఆపసోపాలు
- ఉదయం, సాయంత్రం వేళల్లోనే ప్రచారంలోకి కేడర్
- సభలు, సమావేశాలకే పరిమితమైన అభ్యర్థులు



సూర్యాపేట: లోక్‌సభ ఎన్నికల వేడి మొదలైంది. పోలింగ్‌కు మరో 10 రోజులే గడువు ఉండగా.. అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో గెలుపొందేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. అయితే ఆయా పార్టీలు, అభ్యర్థులు చేస్తున్న ఓట్ల వేటపై భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం 10గంటలు దాటితే ఎండ భగ్గుమంటోంది. సాయంత్రం 6 గంటలు అయినా ఎండ తీవ్రత తగ్గడం లేదు. రెండు రోజుల నుంచి జిల్లా రెడ్‌జోన్‌లోకి వెళ్లడంతో అన్ని పార్టీల కార్యకర్తలు, నాయకులు ప్రచారానికి బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు.

ఇంటింటికీ వెళ్లేందుకు ఆపసోపాలు

సూర్యాపేట జిల్లా పరిధిలోని నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థానాలను గెలవడం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలకు చావోరేవోగా మారింది. ఇప్పటికే ఈ రెండు పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోనే ఉండగా వాటిని నిలుపుకోవాలన్న పట్టుదలతో ఉంది. రాష్ట్రంలో అధికారం చేజారడంతో.. లెక్కలను సరిచేసేందుకు బీఆర్‌ఎస్ ఎలాగైనా ఈ రెండు స్థానాలను గెలవాలన్న కసితో పనిచేస్తోంది. ఇక ఇప్పటి వరకు నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాల్లో గెలవని బీజేపీ ప్రధాని మోదీ మ్యాజిక్‌తో ఖాతా తెరవాలని భావిస్తోంది. ఈ క్రమంలో ఆయా పార్టీల కేడర్ ప్రజల వద్దకు వెళ్లి తమ పార్టీల మేనిఫెస్టోలను వివరిస్తోంది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సూర్యాపేట జిల్లావ్యాప్తంగా 1201 పోలింగ్ కేంద్రాల్లో లక్షా 12 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరందరినీ కలిసేలా అభ్యర్థులు, ఆయా పార్టీల మొదటి శ్రేణి నాయకత్వం ప్రణాళికలు వేసినా.. ఎండ దెబ్బకు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు వారి వెంట నడిచేందుకు రాలేకపోతున్నారు.

ఎండలో తిరిగేందుకు ఆసక్తి చూపని కేడర్

ప్రస్తుతం ఓటర్లను నేరుగా కలిసి ప్రసన్నం చేసుకుంటేనే గాని ఓట్లు రాని పరిస్థితి నెలకొంది. ఇలాంటి తరుణంలో ప్రతి ఓటరును కలుసుకోవడం అభ్యర్థులకు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో తమ గుర్తునైనా ప్రజల వద్దకు చేర్చాలనే ఉద్దేశంతో అభ్యర్థులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం తమ పార్టీ ద్వితీయ శ్రేణి, ఆ కింది స్థాయి నాయకత్వానికి దిశానిర్దేశం చేసేందుకు మండలాల వారీగా ప్రధాన పార్టీలు సమావేశాలు, సభలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇక ప్రచార రథాలతో గల్లీగల్లీ తిరిగేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వారం, పదిరోజులుగా జిల్లాలో భానుడు భగ్గుమనడం, మరి మూడు రోజులుగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతుండడంతో ఎండలో తిరిగేందుకు కేడర్ అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో జోష్ కనిపించడం లేదు. మరో నాలుగైదు రోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇలాగే ఉండే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతుండడం, ప్రచార గడువు దగ్గర పడుతుండడంతో ప్రధాన పార్టీల్లో ఆందోళన నెలకొంది.

కీలకంగా వ్యవహరించాలి


అభివాదం చేస్తున్న బల్మూరి వెంకట్, చామల, తీన్మార్ మల్లన్న తదితరులు

భువనగిరిటౌన్: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌ఎస్‌యూఐ శ్రేణులు కీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్సీ, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం భువనగిరి పట్టణంలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఎన్‌ఎస్‌యూఐ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలోనే యువతకు అధిక ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న), రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుర చందనరెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, నేషనల్ డెలిగేట్ ఎడమ పవన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో పారదర్శకత పెంచిన ఆర్‌టీఐ

- మాజీ ప్రధాన సమాచార కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు

చౌటుప్పల్: సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) సమాజంలో పారదర్శకతను పెంచిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఎలిమినేటి మాధవరెడ్డి షాదీఖాన భవనంలో సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాలు దీర్ఘకాలిక ప్రయోజనాలను కలిగించేలా ఉన్నాయన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి జీఓ ఆన్‌లైన్‌లో ఉంచుతామని, ఆర్‌టీఐ దరఖాస్తులను సైతం ఆన్‌లైన్‌లో తీసుకునేలా చర్యలు తీసుకుంటామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఆయన నాయకత్వంలో అత్యధిక ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాన్యుడికి సైతం గౌరవం దక్కేలా కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని తీసుకువస్తే కేంద్రంలోని బీజేపీ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు పూర్తిగా నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు పారదర్శకంగా సేవ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖుర్షీద్‌పాష, మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, జెడ్పీటీసీ సభ్యుడు చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రమాద కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ శాఖ రిటైర్డ్ ఇన్ చీఫ్ ఎంఏ.కరీం, ప్రతినిధులు పాల్గొన్నారు.


చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని సభలో పరిచయం చేస్తున్న వర్రె వెంకటేశ్వర్లు

మోదీ, కేసీఆర్ మాటలు ప్రజలు నమ్మరు

- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడరూరల్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మాజీ సీఎం కేసీఆర్ చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని కోరుకుంటున్నారని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కోదాడ పట్టణంలోని ఓ కల్యాణమండపంలో కోదాడ పట్టణ, రూరల్, అనంతగిరి మండలాలల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం చేపట్టిన రోడ్ షోలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గత పదేళ్ల పాలనలో మోదీ దేశాన్ని, కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నివిధాలుగా నాశనం చేశారని విమర్శించారు. మతోన్మాద బీజేపీని చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో భారీ విజయంతో ఇండియా కూటమి కేంద్రంలో అధికారం చేపట్టబోతుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిచేది నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్ రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, పీసీసీ సభ్యుడు సీహెచ్. లక్ష్మీనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీలు మందలపు కృష్ణకుమారి, కొణతం ఉమ, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు వంగవీటి రామారావు, తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి జానారెడ్డి, వేనేపల్లి చందర్‌రావు

పోలింగ్ సమయం గంట పొడిగింపు

నల్లగొండ: నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ సమయాన్ని అదనంగా గంట పాటు పొడిగిస్తూ ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ను ఈ నెల 13న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించాలని ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్‌లో ప్రకటించినప్పటికీ.. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6గంటల వరకు పెంచుతూ ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

తుర్కపల్లి: మాయమాటలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం తుర్కపల్లి మండలంలోని మాదాపూర్, వీరారెడ్డిపల్లి, దత్తాయపల్లిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వంపై మూడు నెలల్లోనే ప్రజలకు విశ్వాసం పోయిందని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో చెరువులన్నీ నిండు కుండలా ఉండేవని, గ్రామాల్లో ఎటుచూసినా ధాన్యం రాసులు దర్శనమిచ్చేవన్నారు. కాంగ్రెస్ పాలనలో చెరువులన్నీ అడుగంటి, పంట పొలాలు ఎండిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని అన్నారు. ప్రచారంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న బూతు పురాణం ఎన్నికల కమిషన్‌కు కనబడటం లేదని విమర్శించారు. కార్యకర్తలు ఓటర్లను కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను వివరించి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్యగౌడ్, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, సూదగాని హరిశంకర్‌గౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బీకు నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.


ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

నగదు పట్టివేత

వలిగొండ : ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల కేంద్రంలో పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో మండలంలోని పులిగిల్లకు చెందిన కొమ్మిడి వెంకట్‌రెడ్డి ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్షా 66వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి నగదు ట్రెజరరీకి తరలించినట్లు స్థానిక ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

రెండు ప్రైవేట్ వైద్యశాలలు సీజ్

- కోదాడలో స్క్రీనింగ్ టెస్ట్ పాస్ కాకుండా వైద్యం
- డీజీఏకు ఫిర్యాదు చేయడంతో దాడులు నిర్వహించిన అధికారులు

కోదాడ: కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీ హృదయ వైద్యశాల, కట్టకొమ్ముగూడెం రోడ్డులోని శ్రీలక్ష్మి వైద్యశాలను గురువారం జిల్లా వైద్యాధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం మాట్లాడుతూ.. శ్రీ హృదయ వైద్యశాలకు అనుమతులు లేకపోవడంతోపాటు, డాక్టర్ వైద్యశాల బోర్డుపై అదనపు అర్హతలు పెట్టుకున్నాడని, అదేవిధంగా శ్రీలక్ష్మి వైద్యశాలలో వైద్యుడికి సరైన అర్హతలు లేకుండా వైద్యం చేస్తుండడంతో ఈ రెండు వైద్యశాలలను సీజ్ చేసినట్లు తెలిపారు. నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకున్న తర్వాతే వైద్యశాలలను నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్, వెంకటరమణ, కళ్యాణచక్రవర్తి, అంజయ్య తదితరులున్నారు.

పది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నా..

విదేశాల్లో చదివిన ఓ వైద్యుడు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్ పాస్‌కాకుండానే కోదాడలోని కట్టకొమ్ముగూడెం రోడ్డులో గత పది సంవత్సరాలుగా వైద్యశాల నిర్వహిస్తున్నాడు. దీనిపై పలువురు జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్ అడ్మినిస్ట్రేటర్ కమలహాసన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా అధికారులు తనిఖీలకు వచ్చినట్లు తెలిసింది. అయితే తనిఖీలకు వచ్చిన అధికారులు ఈ వైద్యశాలలను సీజ్ చేసిన సమాచారం కూడా గోప్యంగా ఉంచడం, అడిగితేనే కాని చెప్పకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

మహిళ అదృశ్యం

నూతనకల్ : ఓ మహిళ అదృశ్యమైన సంఘటనపై మండల పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ జూకూరి సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని యడవెల్లి గ్రామానికి చెందిన బొడ్డు పద్మ గత నెల 30న డబ్బుల విషయంలో ఆమె కోడలితో గొడవ పడి ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు బంధువులను, తెలిసిన వారిని విచారించగా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో ఆమె భర్త వెంకన్న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనంతగిరి : పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తమ్మరబండపాలెం గ్రామానికి చెందిన చింతకాయల వీరయ్య(28) గత కొంతకాలంగా మద్యానికి బానిసై ఏ పనిచేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. జల్సాలకు డబ్బులేకపోవడంతో ఇంట్లో కుటుంబ సభ్యులు సైతం డబ్బు ఇవ్వకపోవడంతో జీవితంపై విరక్తిచెంది గత నెల 27న తమ్మరబండపాలెం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లి మహాలక్ష్మమ్మ తండ్రి నర్సయ్య కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా ఈనెల 1న చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి మహాలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం నవీన్‌కుమార్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం : గంజాయి విక్రయిస్తున్న ఓ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.31వేల విలువైన కిలో 250గ్రాముల గంజాయి, 5సెల్‌ఫోన్లను, హుక్కా పాట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు సంబంధించిన వివరాలను గురువారం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రామన్నపేట మండలంలోని కక్కిరేని గ్రామానికి చెందిన ఎడ్ల సాయికుమార్, నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి గ్రామానికి చెందిన తాటిపాముల పవన్, షేక్ జావిద్, చింతకుంట్ల గణేష్, అమ్మనబోలు గ్రామానికి చెందిన బోడ వినోద్‌కుమార్ ముఠాగా ఏర్పడ్డారు. వారు రూ.8వేల చొప్పున వాటా పెట్టి శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నుంచి గంజాయిని తీసుకొచ్చి నల్లగొండ జిల్లాలోని నార్కట్‌పల్లి, అమ్మనబోలు, అక్కెనపల్లి, ఎల్లారెడ్డిగూడెం, కట్టంగూర్ మండలంలోని పిట్టంపల్లి, పామనగుండ్ల, మహాత్మాగాంధీ యూనివర్సిటీలో పలువురికి విక్రయించారు.

పట్టుబడింది ఇలా..

శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం గ్రామానికి చెందిన కిరణ్, ఆశిష్‌ల నుంచి సాయికుమార్, పవన్‌లు గంజాయి కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన గంజాయిని అక్కెనపల్లి గ్రామశివారులో పంచుకుని అమ్మడానికి పథకం వేశారు. దీంతో పోలీసులకు పక్కా సమాచారం అందడంతో నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి, సురేష్ వారిని పట్టుకునేందుకు వెళ్లగా గ్రామశివారులో పలువురు అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకుని వారిని విచారించి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 20మందికి గంజాయి విక్రయించినట్లు ఒప్పుకున్నారు. ఏప్రిల్ 10న శ్రీకాకుళం నుంచి ఇచ్చాపురానికి చెందిన కిరణ్, ఆశిష్‌ల నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు అంగీకరించారు. అమ్మిన వారిద్దరు పరారీలో ఉన్నారని, ఐదుగురు నిందితులు సమీప గ్రామాలు కావడంతో స్నేహితులుగా ఏర్పడి సులభంగా డబ్బులు సంపాదించాలని వ్యాపారం చేసినట్లు అంగీకరించారని అన్నారు. గంజాయి సమాచారాన్ని పోలీసులకు అందించాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కేసు ఛేదించిన సీఐ నాగరాజు, ఎస్‌ఐలు అంతిరెడ్డి, సురేష్, సిబ్బంది రాము, మధు, గిరిబాబు, తిరుమల్, శివశంకర్, శ్రీనివాస్, రమేష్‌లను ఆయన అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

మద్దిరాల : ట్రాక్టర్ బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని పోలుమల్ల శివారులో గల 365 జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూర్ మండలంలోని చికాటయపాలెం గ్రామానికి చెందిన కొండ సందీప్(24) తన ట్రాక్టర్‌లో వరిధాన్యాన్ని లోడ్‌వేసుకుని సూర్యాపేట మార్కెట్‌లో దిగుమతి చేసి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున మండలంలోని పోలుమల్ల శివారులోకి రాగానే 365జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ సందీప్‌పై పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

సిలిండర్ పేలి సామగ్రి దగ్ధం

గరిడేపల్లి : ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి సామగ్రి దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని రేగులగడ్డతండాలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుగులోతు శ్రీను ఇంట్లో వంట చేసేందుకు గ్యాస్‌ను వెలిగించాడు. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమై ఇంట్లో ఉన్న రూ.లక్ష నగదుతో పాటు ధాన్యం, బట్టలు, సామగ్రి మంటల్లో కాలిబూడిదయ్యాయి.

వీడిన వడ్డె యల్లయ్య మిస్సింగ్ మిస్టరీ

- ఏపీలోని జగ్గయ్యపేటలో హత్య.. దొరకని మృతదేహం
- తహసీల్దార్ ఎదుట లొంగిపోయిన నిందితుడు శ్రీకాంతరాజు

సూర్యాపేట : సూర్యాపేట మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వడ్డె యల్లయ్య మిస్సింగ్ మిస్టరీ వీడింది. పథకం ప్రకారం యల్లయ్యను ఏపీలోని జగ్గయ్యపేటలో హతమార్చగా.. మృతదేహం ఇప్పటి వరకు లభ్యం కాలేదు. ఈనెల 19న వడ్డె యల్లయ్య జగ్గయ్యపేటకు భార్యభర్తల మధ్య పంచాయతీ విషయంలో సెటిల్‌మెంట్ చేసేందుకు వెళ్లాడు. వెళ్లిన అతను అక్కడే అదృశ్యమయ్యాడు. నాటి నుంచి సూర్యాపేట మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా యల్లయ్య మిస్సింగ్ మిస్టరీగా మారింది. ఎట్టకేలకు యల్లయ్యను తానే కొందరితో కలిసి హత్య చేసినట్లు నాగారం మండలంలోని మాచిరెడ్డిపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి తాడూరి శ్రీకాంతరాజు (చారి) జగ్గయ్యపేట తహసీల్దారు ఎదుట లొంగిపోగా, పోలీసులు కోర్టులో హాజరుపర్చారు.

పథకం ప్రకారమే హత్య..

వడ్డె యల్లయ్య, తాడూరి శ్రీకాంతరాజులు మాజీ నక్సలైట్లు. వారు జనజీవన స్రవంతిలోకి వచ్చాక ఇద్దరూ కలిసి పలు సెటిల్‌మెంట్లు చేశారు. ప్రస్తుతం శ్రీకాంతరాజు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నాడు. వడ్డె యల్లయ్య సెటిల్‌మెంట్లు చేస్తూ సూర్యాపేట మండలంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నాడు. వీరిద్దరి మధ్య డబ్బుల విషయంలో ఇటీవల పలుమార్లు గొడవలు జరిగాయి. దీంతో ఎలాగైనా యల్లయ్యను హతమార్చాలని శ్రీకాంతరాజు నిర్ణయించుకున్నాడు. యల్లయ్యను స్థానికంగా హత్య చేస్తే ఇబ్బందులు వస్తాయని భావించి జగ్గయ్యపేటలో ఏప్రిల్ నెలలోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకుని హత్యకు పక్కా పథకం వేశాడు. భార్యభర్తల మధ్య పంచాయతీ ఉందని, ఆ పంచాయతీ పరిష్కరించాలని అందుకు కొంత నగదు ఇస్తామని ఓ మహిళతో యల్లయ్యను నమ్మించారు. ఈ క్రమంలో దంపతుల పంచాయతీని సెటిల్ చేసే క్రమంలో డబ్బులు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఈ డబ్బులను తీసుకునేందుకు జగ్గయ్యపేటకు రావాలని పిలిచారు. దీంతో యల్లయ్య ఏప్రిల్ 18న తన అనుచరుడు అంజయ్య, సదరు మహిళతో కలిసి జగ్గయ్యపేటకు వెళ్లాడు. అప్పటికే పక్కా పథకంతో ఉన్న శ్రీకాంతరాజు వారిని ఓ టీస్టాల్ వద్ద కలిసి మహిళతో పాటు అంజయ్యను అక్కడే ఉండమని యల్లయ్యను నమ్మించి తాను అద్దెకు తీసుకున్న ఇంటికి తీసుకెళ్లి హత్య చేసినట్లు శ్రీకాంతరాజు పోలీసులకు తెలిపాడు. మృతదేహాన్ని చేపలు రవాణా చేసే బాక్స్‌లో ఉంచి లారీలో విశాఖపట్నం పంపించామని ఒప్పుకున్నాడు. ప్రస్తుతం మృతదేహం కోసం అక్కడి పోలీసులు గాలిస్తున్నట్లు తెలుస్తోంది.